

నరసరావుపేటలోని మెయిన్ రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్ద బారులు తీరిన పేదలు

అన్న క్యాంటీన్లు పునః ప్రారంభమయ్యాయి. ఇంతకాలం ఆకలితో అల్లాడిన పేదల్లో ఆనందం వెల్లివిరిసింది. కడుపు నింపుకునేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయలేక అల్లాడిన పేదలకు అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చే కేంద్రాలుగా దర్శనమిచ్చాయి. వైసీపీ ప్రభుత్వ విధానాలకు బలైన అన్న క్యాంటీన్లు శుక్రవారం తిరిగి ప్రాణం పోసుకున్నాయి. తక్కువ ధరకు.. నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి ఆ భవనాలను పాడుపెట్టగా పేదలకు చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాటిని పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకే క్యాంటీన్లు ప్రారంభమవగా అల్పాహారం కోసం జనం బారులు తీరారు. భారీ సంఖ్యలో వచ్చిన ప్రజలు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఆరగించి తమ కడుపు నింపారంటూ ఆనందం వ్యక్తం చేశారు. రూ.5కే రుచికరంగా ఆహారం అందించేలా అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



నరసరావుపేట క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న పేదలు



పిడుగురాళ్లలో కార్మికుడికి అన్న క్యాంటీన్‌లో టిఫిన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ఆరంభం.. ఆనందం

- పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్లు
- పట్టణ కేంద్రాల్లో పండుగలా ప్రారంభోత్సవాలు
- ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే క్యాంటీన్ల పునరుద్ధరణ
- మంగళగిరి, తాడేపల్లిలో క్యాంటీన్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్
- తెనాలిలో మనోహర్, రేపల్లెలో అనగాని, అద్దంకిలో గొట్టిపాటి ప్రారంభం

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 16: జిల్లాలోని మున్సిపల్ కేంద్రాల్లో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో పేద ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం పండుగ వాతావరణంలో ఎక్కడికక్కడ అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయి. నిరుపేదల కడుపు నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం సంకల్పించిన అన్న క్యాంటీన్లు ప్రారంభించగా వాటి వద్ద పండుగ వాతావరణం కనిపించింది. రూ.5కే రుచి, శుభ్రతతో కూడిన అల్పాహారం, భోజనం అందుబాటులోకి వచ్చేసరికి పేదలు క్యాంటీన్ల ముందు బారులు తీరారు. చెప్పిన మాట నిలబెట్టుకున్నారని తమ కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందంటూ సీఎం చంద్రబాబును పేదలు ఆశీర్వదించారు. ఐదేళ్ల చిన్నారుల నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు అన్న క్యాంటీన్‌కు వచ్చి ఆకలి తీర్చుకునేందుకు బారులు తీరారు. తొలి రోజు మహిళలు కూడా క్యాంటీన్లకు తరలివచ్చారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభోత్సవాల్లో పాల్గొని పేదలకు స్వయంగా వడ్డించి అల్పాహారాన్ని రుచి చూశారు. ఇక క్యాంటీన్లు ప్రారంభమైన తొలి రోజు వచ్చిన వారందరికీ కాదనకుండా అల్పాహారం, భోజనం అందజేశారు. గుంటూరు పరిధిలో 7, మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో 3, తెనాలిలో 3, పొన్నూరులో ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించామన్నారు. బాపట్ల జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో, చిలకలూరిపేటలో మూడేసి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, మాచర్ల పట్టణాల్లో ఒక్కొక్కటి చొప్పున అన్న క్యాంటీన్లను తొలివిడతలో ప్రారంభించారు.



మాచర్ల: పేదలకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సత్తెనపల్లి: అన్న క్యాంటీన్‌లో అల్పాహారం వడ్డిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ, జనసేన నేతలు



చిలకలూరిపేటలో అన్న క్యాంటీన్‌లో డబ్బు చెల్లించి టోకెన్ తీసుకుంటున్న ప్రత్తిపాటి పుల్లారావు



నరసరావుపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

- నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం, పల్నాడు రోడ్డు, మార్కెట్ సెంటర్లలో అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణబాబు ప్రారంభించారు. అన్న క్యాంటీన్లు అందరి ఆస్తిగా భావించి కాపాడుకోవాలని కలెక్టర్ తెలిపారు.
- చిలకలూరిపేటలోని గడియారం స్తంభం, ఎన్ఆర్‌టీ, అడ్డరోడ్డు సెంటర్లలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్లలో మూడు కేంద్రాల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్న క్యాంటీన్ల ప్రారంభించారు.



కన్నా లక్ష్మీనారాయణ చేతులమీదుగా రూ.లక్ష విరాళాన్ని మునిసిపల్ కమిషనర్ షమ్మీకి అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి రేగళ్ల కోటిస్వామి



మంగళగిరి: అన్న క్యాంటీన్‌తో అందరితో కలిసి అల్పాహారాన్ని రుచిచూస్తున్న లోకేశ్

వృథాలు లేకుంటే పేదల ఆకలి తీరేది : లోకేశ్

నాడు జగన్‌రెడ్డి వృథా ఖర్చులను తగ్గించుకుని ఉంటే పేదల ఆకలి తీరేదని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరి పాత బస్టాండ్, తాడేపల్లి నులకపేటలో అన్న క్యాంటీన్లను లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన పాస్‌పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ తన ఫొటోలను ముద్రించుకునేందుకు రూ.700 కోట్లను ఖర్చు చేశారన్నారు. విశాఖ రుషికొండపై రూ.500 కోట్ల ఖర్చుతో ప్యాలెస్‌ను నిర్మించారన్నారు. సొంత పత్రిక సాక్షికి రూ.400 కోట్లతో ప్రకటనలు ఇప్పించుకున్నారన్నారు. ఈ వృథా ఖర్చులు పెట్టకన్నా 203 అన్నక్యాంటీన్ల నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.200 కోట్లను ఖర్చుచేసి ఉంటే లక్షలాదిమంది పేదల ఆకలి తీరేదన్నారు. ఒక్క రుషికొండ ప్యాలెస్‌కు పెట్టిన ఖర్చుతో నిరుపేద కుటుంబాలకు మూడుపూటలా రెండున్నర సంవత్సరాలపాటు భోజనం లభించేదన్నారు. సాక్షికి ఇచ్చిన డబ్బులతో రెండేళ్లపాటు, సర్వేరాళ్లపై ఫొటోలకు వెచ్చించిన డబ్బులతో మూడేళ్లపాటు అన్న క్యాంటీన్లను నడిపించవచ్చని లోకేశ్ వివరించారు. అన్న ఎన్టీఆర్ పేదలే తన దేవుళ్లని నినదించారని, కూటమి పార్టీలు అదే సూక్తిని పాటిస్తాయన్నారు. ఏ ప్రభుత్వం నిరుపేద కుటుంబాల గురించి ఆలోచిస్తుందో.. ఎవరు పెత్తందారుల గురించి ఆలోచిస్తున్నారో ప్రజలందరూ గుర్తెరగాలని కోరారు. గతంలో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ల మూసివేయగా తాను కౌన్సిల్‌లో నిలదీయగా నాటి మున్సిపల్ మంత్రి మళ్లీ ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. తాను ప్రతిపక్షంలో ఉండి నియోజకవర్గంలో నాలుగు ప్రాంతాల్లో సొంత నిధులతో అన్న క్యాంటీన్ల నిర్వహించానన్నారు.



రేపల్లె: అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు : అనగాని

పేదలు ఎవరూ ఆకలితో అల్లాడ కూడదనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టగానే చంద్రబాబు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని అంబేద్కర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా మూసివేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత చేసిన సంతకాల్లో అన్న క్యాంటీన్ అంశం ఒకటన్నారు. రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చెయ్యడానికి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, అడ్డదారిలో జగన్ అండ్‌కో వేల కోట్ల రూపాయలు దోచుకుతిన్నారన్నారు.

ఎన్టీఆర్ సంకల్పానికి ప్రతిరూపాలు : మనోహర్

పట్టెడన్నం పెట్టి పేదల ఆకలి తీర్చాలన్న అన్న ఎన్టీఆర్ సంకల్పానికి ప్రతిరూపమే అన్న క్యాంటీన్లని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో శుక్రవారం మూడు చోట్ల అన్న క్యాంటీన్లను ప్రారంభించి ప్రసంగించారు. పేదల ఆకలి తీర్చాలని ఆ నాడే ఎన్టీఆర్ ఆలోచిస్తే, దానిని చంద్రబాబు ఆచరణలో పెట్టారని, ఎందరో పేదలకు అన్న క్యాంటీన్లు కడుపు నింపుతున్నాయన్నారు. రూ.5కే పేదల కడుపు నింపేలా అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారం అందిస్తుంటే వైసీపీ ప్రభుత్వం వాటిని మూయించిందన్నారు. పైగా స్వచ్ఛందంగా కొనసాగిస్తున్న క్యాంటీన్లను బలవంతంగా మూతవేయించి వారి పొట్ట కొట్టిందని, ఆ పాపం ఊరికే పోలేదన్నారు. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు తట్టుకుని 500 రోజులకు పైగా అన్న క్యాంటీన్లను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వహించారన్నారు. పేదల ఆకలి తీర్చేలా అన్న క్యాంటీన్లను రానున్న రోజుల్లో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో మరింతగా ముందుకు తీసుకువెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందనడానికి అన్న క్యాంటీన్ల పునః ప్రారంభమే నిదర్శనమన్నారు. అన్న క్యాంటీన్లకు దాతలుగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు రూ.10 లక్షల విరాళాలు అందించడం అభినందనీయమని మాజీ మంత్రి ఆలపాటి కృతజ్ఞతలు తెలిపారు.



తెనాలి: అన్న క్యాంటిన్‌లో అల్పాహారం తీసుకుంటున్న మంత్రి మనోహర్, ఆలపాటి రాజేంద్రప్రసాద్

దాతల విరాళాలు

అన్న క్యాంటీన్లను నిర్విఘ్నంగా కొనసాగించడానికి సీఎం చంద్రబాబు దాతల సహకారాన్ని కోరగా పలువురు స్పందించి విరాళాలు ప్రకటించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్న క్యాంటీన్లు ప్రారంభించిన తొలిరోజునే పెద్దసంఖ్యలో దాతలు విరాళాలు అందజేశారు. చీరాలలో రూ.5.28 లక్షలు, అద్దంకిలో రూ.2 లక్షలు, బాపట్లలో లక్ష, రేపల్లెలో రూ.80,000 వరకు దాతలు విరాళంగా ఇచ్చారు.

- అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఆహారం అందించేందుకు తన బాధ్యతగా జీతంలో నుంచి రూ.25 వేలు అందిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రకటించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన రెండు అన్న క్యాంటీన్లలో ప్రతి శుక్రవారం అయ్యే భోజన ఖర్చు తానే భరిస్తానని ఎమ్మెల్యే నసీర్ ప్రకటించారు. ఒక నెల వేతనం నుంచి రూ.30 వేలను అన్న క్యాంటీన్ ట్రస్ట్‌కి అందిస్తానని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కొల్లి జయరామిరెడ్డి రూ.10,116 చెక్ అందించారు.
- బాపట్లలోని సూర్యలంకరోడ్డులో ప్రారంభించిన అన్నక్యాంటీన్ నిర్వాహణకు ముప్పా కన్‌స్ట్రక్షన్స్ అధినేత, బ్లూప్లేట్ హోటల్ నిర్వాహకులు ముప్పా వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. రేపల్లె మండలం తుమ్మల గ్రామానికి చెందిన రేపల్లె సురేష్ రూ.25 వేలు, రేపల్లెకి చెందిన యలవర్తి లక్ష్మీ రూ.5వేలను అందించారు.
- సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్వాహణకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు రూ.50,002 ఇచ్చారు. భవిష్యత్‌లో కూడా క్యాంటీన్‌కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగి రేగళ్ల కోటిస్వామి రూ.లక్ష, ఎఫ్‌సీఏ విశ్రాంత ఉద్యోగి ఆచంట జనార్ధనరావు రూ.5వేలు ఇచ్చారు. పిడుగురాళ్లలో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో తొలిరోజు అల్పాహారం, భోజనాలను దాత బండ్ల హనుమంతరావు అందజేశారు. పట్టణానికి చెందిన యక్కల భాస్కరరావు రూ.51 వేలు, కట్టమూరి శంకరరావు రూ.50,116, యేలూరి చంద్రశేఖరరావు రూ.25,116 విరాళంగా అందజేశారు.



భవిష్యత్‌లో ఏర్పాటు కానున్న లాజిస్టిక్ పార్క్‌ల నమూనా

లాజిస్టిక్ పార్కుకు భూ పరిశీలన

- తొలివిడతలోనే రాజధాని ప్రాంతానికి ప్రాధాన్యం
- కేంద్రం ఆమోదంతో భూసేకరణపై అధికారుల దృష్టి
- చంద్రబాబు చొరవతో అమరావతిలో పారిశ్రామిక వృద్ధి

తెనాలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వృద్ధి.. రవాణా వ్యవస్థ బలోపేతం.. ఉపాధి కల్పన దిశగా సీఆర్‌డీఏ ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దేశం మొత్తంమీద 15 నగరాల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తొలివిడతలోనే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతోపాటు ఏపీ రాజధాని అమరావతికి కూడా చోటుదక్కింది. అమరావతిని కీలకమైన ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చాలనే చంద్రబాబు ఆలోచనలో భాగంగా లాజిస్టిక్ పార్కు ఏర్పాటు కానున్నది. ఇందుకు సంబంధించి కేంద్రం ఆమోదం లభించడంతో అధికారులు భూసేకరణపై దృష్టి సారించారు. ఈ పార్కు ఏర్పాటుకు గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాలను సీఆర్‌డీఏ ఎంపిక చేసింది. రాజధాని ప్రతిపాదిత ఔటర్ రోడ్డుకు అనుసందానంగా భూములు ఉండేలా చూస్తున్నారనేది సమాచారం. వీటిలో తెనాలి మండలం నందివెలుగు, గుడివాడ, కొలివరం, చేబ్రోలు మండలంలో గొడవర్రు, నారాకోడూరు, శేకూరు, సుద్దపల్లి, వేజండ్ల, దుగ్గిరాల మండలంలో చింతలపూడి, ఈమని, కొల్లిపర మండలంలో అత్తోట, కుంచవరం, మున్నంగి, వల్లభాపురం గ్రామాల పరిధిలో భూములను పరిశీలించాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాజధాని ఔటర్ రోడ్డు ప్రతిపాదిత ప్రాంతంగా సీఆర్‌డీఏ పేర్కొన్న నందివెలుగు ప్రాంతంలో భూములను తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. హైవే అధారిటీ ఆఫ్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ పార్కును ఏర్పాటు చేయనున్నాయి. ఇదే కనుక జరిగితే రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల అభివృద్ధితో పాటు ఆయా ప్రాంతాల వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.



నందివెలుగు దగ్గర మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ

లాజిస్టిక్ పార్కు ఏర్పడితే..

పారిశ్రామిక ఏకీకరణ, గిడ్డంగుల ఏర్పాటు, అడ్డంకులు లేని రవాణా వ్యవస్థను సృష్టించటమే లక్ష్యంగా ఏర్పాటయ్యే లాజిస్టిక్ పార్కుతో ఆయా ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. 203 ఎకరాల్లో ఏర్పాటయ్యే పార్కు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1372 కోట్లు కేటాయించింది. దీనిలో రూ.147 కోట్లు భూ సేకరణకు, గోదాముల వంటి స్టోరేజ్ ప్రాంత అభివృద్ధికి రూ.494 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.731 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియ పూర్తిచెయ్యాలనేది సారాంశం. ఈ నెలాఖరుకు భూముల పరిశీలన పూర్తిచేసి, గుర్తించిన భూముల వివరాలను సీఆర్‌డీఏకు అందించాలి. ఆ తర్వాత విడతల వారీగా లాజిస్టిక్ పార్కు ఏర్పాటు సాకారం కానుంది.

దాచేపల్లిలో ధనలక్ష్మీ అలంకరణలో కరెన్సీ నోట్లతో అలంకరించిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు, కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 17 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలుపెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యమీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్' , కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గులెహర్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తాజాగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు.





2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషభ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్ రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.

తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?



జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగియి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యంలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మర్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షూ 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతారామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

ఉత్తమ చిత్రం: 'ఆట్టమ్ (మలయాళం)
ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార- కన్నడం)
ఉత్తమ నటి: నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)
ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)
హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్: కాంతార (కన్నడ)
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్: బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ
ఉత్తమ నూతన దర్శకుడు: ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వి)
ఉత్తమ సహాయ నటి: నీనా గుప్తా (ఉంఛా- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)
ఉత్తమ బాలనటుడు: శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)
ఉత్తమ ఛాయాగ్రాహకుడు: రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: ఆనంద్ ఏకార్షి(ఆట్టమ్)
ఉత్తమ సంభాషణల రచయితలు: అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)
ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం): ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)
ఉత్తమ గీత రచయిత: నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)
ఉత్తమ నేపథ్య గాయకుడు: అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)
ఉత్తమ గాయని: బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)
ఉత్తమ ప్రాంతీయ చిత్రం: (కార్తికేయ 2 - తెలుగు)
ప్రత్యేక ప్రశంస: నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)
ఉత్తమ ఎడిటర్: మహేశ్ భువనేంద్ (ఆట్టమ్)
ఉత్తమ యాక్షన్ డైరెక్టర్: అన్బరివు (కేజీఎఫ్ 2'
బెస్ట్ బుక్ ఆన్ సినిమా: కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
బెస్ట్ క్రిటిక్: దీపక్ దుహ (హిందీ)

గోడకూలి విద్యార్థుల దుర్మరణం

పెదకాకాని లూథరగిరి కాలనీలో విషాదం



బంగారు సిద్ధార్థ (పాతచిత్రం)
కోలాటపు సాత్విక్ (పాతచిత్రం)

పెదకాకాని, ఆగస్టు 16: ఇద్దరు విద్యార్థులను ప్రహరీ మింగేసింది.. వేర్వేరు కుటుంబాలకు చెందిన పిల్లలు మృత్యువాత పడడంతో రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెదకాకానిలోని లూథరగిరి కాలనీలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. కాలనీకి చెందిన బంగారు రాజు, జ్యోతి దంపతుల కుమారుడైన సిద్ధార్థ(13) పెదకాకానిలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన కోలాటపు పెద్దదిబ్బయ్య, రత్నకుమారి దంపతుల కుమారుడైన సాత్విక్(12) వెనిగండ్ల జడ్పీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. సెలవు దినాలు కావడంతో ఆడుకుంటూ ఇద్దరు సాత్విక్ ఇంటి ముందు ఉన్న ప్రహరీ వద్దకు వచ్చారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న ప్రహరీకు పెట్టిన లారీ చెక్కలకు ఆడుకుంటూ వారు తగిలారు. దీంతో లారీ చెక్కలు పక్కకు పడిపోవడంతో గోడ విరుచుకుని సిద్ధార్థ, సాత్విక్‌లపై పడింది. ప్రహరీ కూలి పడటాన్ని చూసిన స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ప్రహరీ కింద ఉన్న ఇద్దర్ని బయటకు తీసి, వైద్య చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఇరువురు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో పెదకాకాని లూథరగిరికాలనీలోని ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. పెదకాకాని పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణానదిలో దూకి మహిళ గల్లంతు



రమ (పాతచిత్రం)

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16: కృష్ణానదిలోకి దూకి ఓ మహిళ గల్లంతైన సంఘటన తాడేపల్లి పరిధిలోని ప్రకాశం బ్యారేజి వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన రమ అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటనకు పాల్పడినట్టు పోలీసులు తెలియజేశారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గల్లంతైన రమ ఆచూకీ తెలియరాలేదని పోలీసులు తెలిపారు. వివాహిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

20న రాష్ట్ర క్యారమ్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: ఆంధ్ర స్టేట్ క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం డి 2 బ్లాక్‌లో జూనియర్, యూత్ బాల, బాలికల విభాగాల్లో రాష్ట్ర క్యారమ్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగాల్లో 2006, యూత్ విభాగంలో 2003 తరువాత పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులని తెలిపారు. ఎంపికలకు వచ్చే వారు విధిగా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 99511 15678 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఆసుపత్రులను సురక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలి

● గుంటూరులో కదం తొక్కిన జూడాలు ● సంపూర్ణ మద్దతు ప్రకటించిన ఐఎంఏ, జీడీఏ



గుంటూరులో మానవహారంగా ఏర్పడిన జూడాలు, నిరసనలో గాయపడినట్లు జూడాల వేషధారణ

గుంటూరు(మెడికల్) ఆగస్టు 16: ప్రభుత్వాస్పత్రులను సురక్షిత ప్రాంతాలుగా (సేఫ్ జోన్ ఏరియా) ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆబ్జుడా) డిమాండ్ చేసింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో పీజీ ట్రైనీ విద్యార్థిని హత్యాచారానికి గురవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ జూనియర్ డాక్టర్లు శుక్రవారం గుంటూరులో కదం తొక్కారు. జూడాలకు డెంటల్, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు తమ సంఘీభావం ప్రకటించి, మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. పలు మహిళా సంఘాలు కూడా జూడాల ఆందోళకకు మద్దతు ప్రకటించాయి. నగరంలో జూనియర్ డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. నగర కూడళ్లల్లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆబ్జుడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెండ్యాల దీక్షిత్ మాట్లాడుతూ వైద్యులకు రక్షణ కల్పించే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ ఫర్ డాక్టర్స్ చట్టం అమల్లోకి వచ్చేంత వరకు తాము చేపట్టిన నిరవధిక ఆందోళన విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ట్రైనీ పీజీ కుటుంబానికి న్యాయం చేయాలని, హంతకులను ఉరి తీయాలని, జూనియర్ డాక్టర్ల రక్షణకు కేంద్రం సీపీఏ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కూడా ఓపీ సేవలు, ఎలెక్టివ్ డ్యూటీస్‌ను బహిష్కరించారు. జూనియర్ డాక్టర్ల గైర్హాజరుతో రోగుల ఇబ్బందులు పడకుండా నివారించేందుకు గుంటూరు వైద్య కళాశాల నుంచి, వైద్య ఆరోగ్య శాఖ నుంచి 50 మంది వైద్యులను డిప్యుటేషన్‌పై తాత్కాలికంగా గుంటూరు జీజీహెచ్‌కు పంపారు. వివిధ ఫార్మసీ కళాశాల నుంచి సుమారు 80 మంది ఫార్మా డీ విద్యార్థులను సైతం ఆసుపత్రి ఓపీ విభాగాల్లో నియమించారు.

నేడు ప్రైవేటు ఆసుపత్రుల మూసివేత

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ట్రైనీ పీజీవిద్యార్థి పాశవిక హత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మహిళా వైద్య విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల పాటు జిల్లాలో అన్ని ప్రైవేటు వైద్యశాలలు మూసివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఐఎంఏ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్, నగర అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తదితరులు మాట్లాడారు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకొనే విధంగా మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను దేశ ప్రజానీకమంతా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. హంతకులకు వెంటనే గుర్తించి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు నిరసనగా ఆగస్టు 18వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 19వ తేదీ ఆదివారం ఉదయం ఆరు వరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులను, క్లినిక్‌లను, నర్సింగ్ హోమ్‌లను మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. ఓపీ, ఇతర ఎలెక్టివ్ సేవలు ఉండవన్నారు. కేవలం మానవతా దృక్పథంతో అత్యవసర కేసులకు మాత్రమే చికిత్సలు అందించాలని తీర్మానించినట్లు డాక్టర్ నందకిషోర్ తెలిపారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ పీ విజయ, కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీఎస్ హరిత మాట్లాడుతూ ట్రైనీ పీజీ హత్యాచార ఘటన అందరినీ తీవ్రంగా కలచివేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా నగరంలోని వైద్యులందరూ శనివారం ఉదయం 9 గంటలకు నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీ బయలుదేరి, శంకర్‌విలాస్, ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రభుత్వాస్పత్రి వరకు జరుగుతుందన్నారు. విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ప్రతినిధి డాక్టర్ నల్లూరి సుబ్బానాయుడు, జూనియర్ డాక్టర్ల ఆందోళనకు తమ దంత వైద్యుల సంఘం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఈదర కృష్ణమూర్తి, వెలగా మహేష్, తాతా సేవకుమార్, బీ వెంకటేశ్వరరావు, బీటీ అప్పారావు, చేబ్రోలు విశ్వేశ్వరరావు, కోటా సురేష్‌కుమార్, సీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

పోరాట యోధుడు గౌతు లచ్చన్న

- మంత్రి అనగాని

రేపల్లె, ఆగస్టు 16: అతి చిన్నవయస్సులోనే మహాత్మాగాంధీ పిలుపునందుకుని దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గౌతులచ్చన్న 115వ జయంతి సందర్భంగా బాపట్ల జిల్లా రేపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరతజాతి విముక్తి కోసం అనేక సార్లు అరెస్టయి జైలు జీవితం అనుభవించారన్నారు. రైతాంగ హక్కుల కోసం తడ నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసిన మొదటి వ్యక్తి అని ఆయన చెప్పారు. గౌడ కులస్థులకు పితామహుడని ఆయన తెలియజేశారు. లచ్చన్న లాంటిఎందరో నాయకులు పోరాడి సాధించిన హక్కులను ప్రజలకు చెందేలా కృషి చేశారన్నారు. గౌతులచ్చన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరావు, పంతాని మురళీధరరావు, గూడవల్లి బాబు, కొపనాతి రాజశేఖర్, యరగాళ్ళ శ్రీనివాసరావు, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, తాతా ఏడుకొండలు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గరీబ్‌రథ్ రైలు చివరి ట్రిప్

● నేడు గుంటూరు మీదగా యశ్వంత్‌పూర్‌కు... రేపు పూరీకి
● సెప్టెంబరు 21 నుంచి ఎల్‌హెచ్‌బీ(భోగీలతో) ప్రయాణం

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా 12 సంవత్సరాలకు పైగా సేవలందించిన నెంబరు. 22883/22884 పూరీ - యశ్వంత్‌పూర్ - పూరీ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ వయా గుంటూరు రైలు చివరి ట్రిప్ శని, ఆదివారాలలో ముగియనుంది. మొత్తం త్రీటైర్ ఏసీ భోగీలతో రాకపోకలు సాగించే ఈ వీక్లీ రైలులో సైడు కూడా మూడు బెర్తులుంటాయి. దీని వలన ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. కేంద్ర రైల్వేమంత్రిగా లాలుప్రసాద్ యాదవ్ ఉన్నప్పుడు ఈ రైలుని ప్రవేశ పెట్టారు. ఇటీవలకాలంలో ప్రయాణీకుల నుంచి తరచుగా ఫిర్యాదులు వస్తుండటంతో గరీబ్‌రథ్‌ని ఎల్‌హెచ్‌బీ రేక్‌గా మార్చాలని రైల్వే శాఖ నిర్ణయం తీసుకొన్నది. ఆ మేరకు కొన్ని నెలల క్రితమే అడ్వాన్స్ రిజర్వేషన్‌ని సెప్టెంబరు 21వ తేదీ వరకు రద్దు చేసింది. ప్రతీ శుక్రవారం పూరీలో బయలుదేరే ఈ రైలు శనివారం ఉదయం 6 గంటల సమయంలో గుంటూరుకు వచ్చి రాత్రికి యశ్వంత్‌పూర్‌కు చేరుకొంటుంది. అలానే శనివారం రాత్రి యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం గుంటూరుకు వచ్చి పూరీకి బయలుదేరి వెళుతుంది. ఇంచుమించు నెల విరామం అనంతరం ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో కొత్త రూపురేఖలతో ఈ రైలు సెప్టెంబరు 21 నుంచి గుంటూరు డివిజన్ ప్రయాణీకులకు తిరిగి అందుబాటులోకి రానుంది.

విస్తృతంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

● రూ.11.04 లక్షల అపరాధ రుసుం

అచ్చంపేట, ఆగస్టు 16 : మండలంలోని అచ్చంపేట సెక్షన్‌లో తాడువాయి, చల్లగరిగ, తాళ్ళచెరువు, కోనూరు, పెదపాలెం, వేల్పూరు, చింతపల్లి, చిగురుపాడు, ఓర్వకల్లు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.11.04 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు కే.సూర్య ప్రకాష్, శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మంది, అక్రమంగా విద్యుత్ వాడుతున్న 17 మంది, అనుమతించిన క్యాటగిరికి కాకుండా ఇతర క్యాటగిరిలో విద్యుత్ వాడుకున్న ముగ్గురికి అదనంగా విద్యుత్ వాడుతున్న 106 మందికి మొత్తంగా రూ.11.04 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయన్నారు. సమావేశంలో డీఈఈ ఎం రవి కుమార్, కే రవి కుమార్, కే రాజశేఖర్, ఏఈ ఏ చంద్రశేఖర్, జీ శివ కోటిరెడ్డి తదితర అధికారులతో పాటు 41 మంది తనిఖీ అధికారులు, 123 మంది సిబ్బంది 41 బృందాలుగా ఏర్పడి 2,416 సర్వీసులను తనిఖీ చేసినట్టు తెలిపారు.



సదస్సును ప్రారంభిస్తున్న మాధవశంకర్

జీవన్ ప్రమాణ్‌తో నిరంతరాయంగా పెన్షన్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: జీవన్ ప్రమాణ్ దాఖలు చేయడం ద్వారా ఏడాది పాటు నిరంతరాయంగా పెన్షన్ అందుకునే అవకాశం ఉంటుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ సహాయక కమిషనర్ జీఆర్‌జేఆర్ మాధవ శంకర్ తెలిపారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై జరిగిన జీవన్ ప్రమాణ్ అవగాహన సదస్సు, విజిలెన్స్ అవగాహన క్యాంపెయిన్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ భవిష్యనిధి కమిషనరు రాజేశ్వర్ రాజేష్ మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ అందించే వివిధ పథకాలను సభ్యులందరూ వినియోగించుకోవాలన్నారు. సభలో అతిథిగా పాల్గొన్న దేవస్థానం కమిటీ అధ్యక్షులు సి హెచ్ మస్తానయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎం రామ శేషన్, డి సాయి ఆనంద్ కుమార్, ఎం రామశేషు, అనూష, కే సుధాకర్ రావు, ఎం కృష్ణార్జున్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరమా! ఆందోళన వద్దు!!

అందుబాట్లోకి నూతన వైద్య పరిజ్ఞానం

గుంటూరు (మెడికల్) ఆగస్టు 16: ఉమ్మడి గుంటూరు జిల్లాలో డెంగీ జ్వరాలు వెలుగు చూస్తున్నాయి. డెంగీ బారిన పడి గుంటూరులో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న పలువురు రోగులు కనిపిస్తున్నారు. వీరిలో పలువురు రక్తస్రావం బారిన పడి ఐసీయూ వార్డుల్లో చికిత్సలు పొందటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో పలువురు డెంగీ లక్షణాలతో మృతి చెందినా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం ఇవి డెంగీ మరణాలు కావని బుకాయిస్తోంది. రోగుల సీరం నమూనాలు పరీక్షిస్తే డెంగీ పాజిటివ్‌గా రావడం లేదని వివరిస్తోంది. అయితే కొన్ని కేసుల్లో డెంగీ నిర్ధారణ కాకపోయిన డెంగీ జ్వర లక్షణాలు, రక్తస్రావం కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. వీరికి ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడంతో షాక్ సిండ్రోమ్‌తో మృతి చెందుతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. గతంలో కన్నా నేడు వైద్య విజ్ఞానం, డాక్టర్ల వైద్య పరిజ్ఞానం బాగా పెరిగింది. ముఖ్యంగా డెంగీ జ్వర చికిత్సల్లో కొత్త అంశాలు తెలియడంతో రోగులకు సురక్షితంగా సమర్థవంతమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.

ఏపీటీటీ స్థాయిలే కీలకం..

గతంలో డెంగీ రోగుల్లో ప్లేట్‌లెట్లు పాతిక వేలుకు తగ్గితే రక్తస్రావం జరిగి పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని అందరూ భయపడే వారు. అందుకే తరచూ రోగుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్యను పరీక్షిస్తుండే వారు. నేడు అందుబాట్లోకి వచ్చిన శాస్త్రీయ సమాచారం ప్రకారం రోగుల్లో అంతర్గత రక్తస్రావానికి, ప్లేట్‌లెట్ల సంఖ్యకు అంత సంబంధం లేదని వైద్య వర్గాలు కొత్త విషయం చెబుతున్నాయి. 'డెంగీ రోగుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్య కంటే 'యాక్టివేటెడ్ పార్షియల్ థ్రాంబోప్లాస్టిన్ టైమ్' (ఏపీటీటీ) అత్యంత కీలకం. ఇది సాధారణ స్థాయిలో ఉంటే ప్లేట్‌లెట్ల సంఖ్య పదివేలకు తగ్గినా భయపడాల్సిన పని లేదు. అదే ఏపీటీటీ స్థాయి పెరిగితే ప్లేట్‌లెట్ల సంఖ్య 40 వేలు ఉన్నా రోగుల్లో రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంటుందని' నగరానికి చెందిన ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ స్పెషలిస్ట్ డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు.

రక్తస్రావం నివారణకు ఎఫ్‌పీపీ...

ఏపీటీటీ స్థాయిని బట్టి రోగుల్లో రక్తస్రావం జరిగే విషయాన్ని చాల ముందుగానే తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. ఒకవేళ రోగుల్లో ఏపీటీటీ స్థాయి పెరిగితే, రక్తస్రావం నివారించేందుకు ప్రస్తుతం కొత్తగా ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్‌పీపీ) ఇస్తున్నామని ఆయన తెలిపారు. గతంలో మాదిరిగా ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎఫ్‌పీపీ ఇచ్చిన రోగుల్లో రక్తస్రావం బాగా తగ్గిపోతుందని, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లకుండా సంరక్షించవచ్చని డాక్టర్ రేవూరి హరికృష్ణ తెలిపారు.



క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 15: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం ప్రాజెక్ట్ నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067, ఎడమ కాలువ ద్వారా 7518, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,150, నాలుగు క్రస్ట్ గేట్ల ద్వారా 32,400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 79,535 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 79,535 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 18 వేల క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16: ఎగువ ప్రాజెక్టుల నుంచి భారీగా వరదనీరు వస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 32 వేలు, కీసర వాగు నుంచి మూడు వేల క్యూసెక్కుల వంతున మొత్తం 35 వేల 500 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను ఒక అడుగు వంతున ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17 వేల 400 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 16: పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 49,217 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 57,737 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు. దీనిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని తెలిపారు. రెండు గేట్ల ద్వారా ఈ నీరు విడుదలవుతుందన్నారు.

అమెరికా ఫెలోషిప్పులకు ఫొటోగ్రఫీ విద్యార్థుల ఎంపిక

పెదకాకాని, ఆగస్టు 16: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ జర్నలిజం ఆధ్వర్యంలో ఉన్న డిపార్టుమెంట్ ఆఫ్ ఫొటోగ్రఫీ లో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్స్‌ను అభ్యసిస్తున్న దామరచర్ల శంకరరావు, గౌరిశెట్టి సురేష్‌బాబులకు ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటీ వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫెలోషిప్పులకు ఎంపిక చేశారు. శంకరరావు ఉమ్మడి గుంటూరు జిల్లా ఫొటో ఎలైడ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరువురిని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి. అనిత, వర్సిటీ ఫొటోగ్రాఫర్ జి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న టి-10 క్రికెట్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: టి-10 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17, 19, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారు అక్టోబరులో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 9247111266, 9849448728 అనే నెంబర్లును సంప్రదించాలని సూచించారు.

అల్బెండజోల్ మందుల కొరత.. పంపిణీ వాయిదా

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ వాయిదా వేసింది. కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన అల్బెండజోల్ మాత్రలు అందుబాటులో లేనందున వాయిదా వేశారు. సెప్టెంబరు 25వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడా రెండుసార్లు నిర్వమించే నిర్మూలన కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తామన్నారు.

పలువురు అదనపు ఎస్పీలు, సీఐలు బదిలీ

గుంటూరు, ఆగస్టు 16 : జిల్లాలో పలువురు అదనపు ఎస్పీలు, సిఐలను బదిలీ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో అదనపు ఎస్పీలను బదిలీ చేశారు. జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్పీ అరిటాకుల శ్రీనివాసరావును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అదనపు డీసీపీగా నియమించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కే ఈశ్వరరావును సీఐడీ విభాగానికి బదిలీ చేశారు. గుంటూరు ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ షెల్కె విశ్వనాథన్‌ను ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు.

ఈస్ట్ ట్రాఫిక్ సీఐ గా అశోకకుమార్

రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేశారు. పల్నాడు డీసీఆర్బీలో ఉన్న అశోక్ కుమార్‌ను ఈస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న వేణును నెల్లూరు రూరల్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న షేక్ సుభానిని నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న రాజేశ్వరరావును నెల్లూరు జిల్లా కావలి రూరల్ సీఐగా నియమించారు. రేంజి వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును ప్రకాశం జిల్లా పొదిలి రూరల్ సర్కిల్ సీఐగా నియమించారు. ఇంటిలిజెన్స్‌లో ఉన్న మేడా శ్రీనివాస రావును ప్రకాశం జిల్లా ఒంగోలు 2 టౌన్ సీఐగా నియమించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.91 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	102, 110,121
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

46,624 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 39,118 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 46,624 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,864 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8000	14500
నెంబరు. 5	9500	12000	నెంబరు. 5	9800	12500
273	11000	14500	273	–	–
341	8200	16000	341	10000	13200
4884	11700	11700	4884	11000	16500
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18700	తేజ	10000	18500
బ్యాడిగి	8500	13200	బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	9000	12000	దేవనూరుడీలక్స్	8500	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



పిడుగురాళ్లలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

అన్న క్యాంటీన్లు పేదలకు వరం

● నియోజకవర్గంలో మరికొన్ని అన్న క్యాంటీన్ల ఏర్పాటు

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 16: అన్న క్యాంటీన్లు పేదలకు వరమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్లలో అన్న క్యాంటీన్‌ను ఆయన పునఃప్రారంభించారు. అనంతరం పలువురికి ఆహారపదార్థాలను అందజేసి వారితోపాటు ఎమ్మెల్యే యరపతినేని, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ సీఐ వెంకటరావు, మరికొంతమంది కూటమి నేతలు అన్న క్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను మూతవేయడంతో ఎంతో మంది పేదలు, కూలీలు, దిగువ తరగతికి చెందిన వారు ఆకలితో ఇబ్బంది పడ్డారన్నారు. నియోజకవర్గ పరిధిలో దాచేపల్లి, గురజాలలోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, ఏఈ రాఘవేంద్రరావు, పాండురంగ శ్రీను, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, సయ్యద్ అమీర్‌అలి తదితరులున్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళాలు అందజేత :

అన్న క్యాంటీన్‌కు తొలిరోజు బండ్ల హనుమంతరావు దాతగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సుమారు వెయ్యి మందికి పైగా టిఫిన్, భోజనం అందజేశారు. అదేవిధంగా పట్టణానికి చెందిన యక్కల భాస్కరరావు రూ. 51 వేలు, కట్టమూరి శంకరరావు రూ.50,116, యేలూరి చంద్రశేఖరరావు రూ.25,116లు అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు చెక్కుల రూపంలో అందజేశారు.



రూ.51వేల చెక్కును ఎమ్మెల్యే యరపతినేనికి అందజేస్తున్న భాస్కరరావు



అన్నక్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, సీఐ వెంకటరావు తదితరులు

ఆకలి తీర్చే రాజ్యం వచ్చింది : ఆత్మకూరి పున్నయ్య



ఐదేళ్ల తరువాత పేదవాడి ఆకలి తీర్చే రాజ్యం వచ్చినందుకు సంతోషంగా వుంది. గత ప్రభుత్వ పాలనలో సరాసరి సగటు ఆదాయంలో సగం ఖర్చు భోజనానికే సరిపోయేది. రిక్షా కార్మికులుగా, చిరువ్యాపారుల వద్ద గుమస్తాగా వున్న వారెందరికో అన్న క్యాంటీన్ ఎంతో ఉపయోగం.

ఆకలి బాధ తప్పుతుంది : శేషగిరిరావు, బస్సు క్లీనర్



ప్రైవేటు పాఠశాల బస్సుకు క్లీనర్‌గా వుండే నేను మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వెళ్లాలంటే అయ్యేపని కాదు. అన్న క్యాంటీన్ వల్ల ఇకనుండి ఆ ఇబ్బంది తప్పుతుంది. నాలాంటి మధ్యతరగతి వారెందరో అన్న క్యాంటీన్ ఏర్పాటు వల్ల ఆకలిబాధ తీర్చుతున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు.

పల్నాడుకు మరో మణిహారం సోలార్ పవర్

● టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రూ.100 కోట్లతో ప్లాంట్

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడి

రెంటచింతల, ఆగస్టు 16: సత్రశాలలోని కృష్ణానది వద్ద నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రూ.100 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నామని ఇది పల్నాడుకు మరో మణిహారమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం రెంటచింతలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు కోసం సర్వే నెంబర్ 883లో భూమిని మంతటిని సర్వే చేయడం పూర్తైందని పేర్కొంటూ ఆర్డీవో రిపోర్టు ఇవ్వగానే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 5 ఎకరాలకు గాను 1 మెగావాట్ విద్యుత్ తయారౌతుందని, ఆ లెక్కన 100 ఎకరాల్లో 20 మెగావాట్ల విద్యుత్ తయారు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని, ఇదే విషయాన్ని విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో గోగుల వెంకట్రామిరెడ్డి, లక్ష్మారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మాచర్లటౌన్, ఆగస్టు 16: నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం మాచర్ల పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18న పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలలో సాఫ్ట్‌వేర్‌తో పాటు నాన్‌టెక్నికల్ కంపెనీలు సుమారు 70 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 1000 మందికి ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, సైదయ్య, శివ, బాబుఖాన్, అంజి, జూలకంటి గౌతమ్‌రెడ్డి, అక్కిరెడ్డి పాల్గొన్నారు.



నూతక్కి విద్యావతి

ఉపాధ్యాయురాలుకి డాక్టరేట్

రాజుపాలెం,ఆగస్టు16: స్థానిక జడ్పీహైస్కూల్లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నూతక్కి విద్యావతికి నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలుగు, ప్రాచ్య భాషా విభాగ శాఖాధిపతి అచార్య ఇరపని మాధవి పర్యవేక్షణలో తాటికోల పద్మావతి సాహిత్యం- పరిశీలన అనే అంశంపైన పరిశోధన చేసినందుకు విశ్వవిద్యాలయం విద్యావతికి డాక్టరేట్ ప్రదానం చేసింది. తమ ఉపాధ్యాయురాలు విద్యావతి డాక్టరేట్ పొదటం ఎంతో సంతోషంగా, గర్వం గా ఉందని హెచ్ఎం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నక్యాంటీన్



అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

● కూటమి పాలనలో ప్రజలు హాయిగా జీవిస్తున్నారు

● తప్పులు చేసిన వైసీపీ నేతలపై చర్యలు తప్పవు

● మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు16: పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను నిర్వహిస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పేదలకు అల్పాహారం వడ్డించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్నక్యాంటీన్‌లను పునఃప్రారంభించి రూ.5లకే నిరుపేదలకు నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరిపోయిందని, అభివృద్ధి, ప్రజా సంక్షేమం గాడి తప్పిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోజుకు 18 గంటలు కష్టపడుతూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నారన్నారు. కూటమి పాలనలో ప్రజలంతా స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు.

టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం

ఆర్‌అండ్‌బీ బంగ్లా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, బాబుఖాన్, కొమెర శివ, సూరె యలమంద, షేక్ మదార్‌సాహెబ్, మున్సిపల్ కమిషనర్ చిన ఏసోబు, రంగా సత్యం, మంజుల అంజి, బత్తుల అనిల్, గోపవరపు చెన్నకేశవరావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, యేచూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలో అన్న క్యాంటీన్ సేవలు ప్రారంభం కాగా నిరుపేదలు, నిర్భాగ్యులు, శ్రామిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వాన్ని కీర్తిస్తున్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది

- డీ.నాగేశ్వరరావు, ముఠా కార్మికుడు



అన్నా క్యాంటీన్ ద్వారా నాలాంటి పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉంది. బయట హోటల్లో అధిక రేట్లు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. మంచి భోజనం అందించడం వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది.

భోజనం సంతృప్తినిచ్చింది

- వీ.కొండానాయక్, రైతు కూలీ



వివిధ పనులపై రెంటచింతల నుంచి మాచర్ల పట్టణానికి వచ్చాను. సమయానికి నామమాత్రం నగదుతో రుచికరమైన భోజనం అందించారు. నాకు చాలా సంతృప్తినిచ్చింది. టీడీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి నా కృతజ్ఞతలు.



అన్నక్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

'డయిల్ యువర్ ఎమ్మెల్యే'

● పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పోస్టర్లును ఆవిష్కరిస్తున్న భాష్యం ప్రవీణ్, స్థానిక టీడీపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 'డయిల్ యువర్ ఎమ్మెల్యే' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను నవభారత్‌నగర్‌లో ఆయన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించి, కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఒకే ఒక్క ఫోన్ కాల్‌తో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని మొత్తం ఐదు మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమ నిర్వహణ కోసం మొత్తంగా 10 మంది ప్రజా సేవక్‌లను నియమించినట్లు తెలిపారు. ఇందులో ఒకరు కార్యాలయంలో ఉంటారని, మరోకరు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని, మిగిలినవారు ప్రతి మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు. మండల హెడ్ క్వార్టర్స్‌లో వారంలో ఒక రోజున చొప్పున ఐదు రోజుల్లో అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఎమ్మెల్యే కూడా వినతులు స్వీకరిస్తానని అన్నారు. ప్రతి మండలానికి ఒక ఫోన్ నెంబరు అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




కన్నాకు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు, పక్కన ఎమ్మెల్యే ప్రవీణ్

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

● ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుల సమావేశంలో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 16 : సత్తెనపల్లి నియోజక వర్గంలోని ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కన్నా మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పేదవిద్యార్థుల విద్యా ఉన్నతికి సహకరించాలని కోరారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాటాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ, నియబంధనల ప్రకారం పాఠశాలలను నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేలు కన్నా, ప్రవీణ్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, డైరెక్టర్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.



సచివాలయంపై మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేల ఫోటోలు

సచివాలయంపై బొమ్మలు తొలగలేదు..

బెల్లంకొండ, ఆగస్టు 16 బెల్లంకొండ మండలం, నాగిరెడ్డిపాలెం సచివాలయంపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఫోటోలు ఇంకా దర్శనమిస్తూనే ఉన్నాయి. ఈ విషయంపై ప్రభుత్వం మారిన అధికారుల తీరు మారలేదని, కొందరు అధికారులు వైసీపీ వీర భక్తులుగా ఉంటూ కూటమి ప్రభుత్వ ఆదేశాలను సైతం అమలు చేయటం లేదని స్థానిక కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి మాట్లాడుతూ.. సచివాలయంపై మాజీ సీఎం, ఎమ్మెల్యే ఫోటోలు తొలగించాలని మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోవటం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించి సచివాలయంపైవున్న మాజీ సీఎం, ఎమ్మెల్యేల ఫోటోలను తొలగించాలని, వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులపై, ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వెన్నా సీతారామిరెడ్డి, స్థానిక టీడీపీ నేతలు కోరుతున్నారు.

అంకాళమ్మ ఆశీస్సులు అందరికీ కావాలి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, ఆగస్టు 16: పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం అంకాళమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరికీ కావాలని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా స్థానిక అంకాళమ్మ అమ్మవారికి బోనాలు సమర్పణ వేడుకలో ఆయన పాల్గొన్నారు. కాపు, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన బోనాలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హారతులిచ్చి ప్రారంభించారు. ఉపవాసం ఉన్న మహిళలు పొంగళ్లను తలపై పెట్టుకొని మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించి ఆలయంలో నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవకుమార్‌శర్మ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి పూర్ణకలశంతో స్వాగతం పలికారు. ఊరేగింపుగా వచ్చిన మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కర్జా సైదారావు, చప్పిడి రాము, బాలునాయక్, ఎస్‌పీఆర్ కృష్ణ, బవిరిశెట్టి పూర్ణచంద్రరావు, మహేష్, తోట నరసింహారావు, జక్కా వీరయ్య, పలిశెట్టి రాఘవ, బంకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

మాచర్ల రూరల్, ఆగస్టు 16: పట్టణంలోని పురపాలక సంఘంలో శనివారం మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ చిన ఏసోబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణాభివృద్ధిపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

దాడి ఘటనలో 9 మందిపై కేసు

రెంటచింతల, ఆగస్టు 16: మండలంలోని తుమ్మకోట గ్రామంలో శుక్రవారం ఉదయం జరిగిన దాడి ఘటనలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనలో పొట్టిపొగు పెద యాకోబ్, నగేష్, చిన యాకోబ్, బుజ్జిలు గాయాలపాలుకాగా పెద యాకోబ్‌ను గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించామన్నారు. దాడులకు పాల్పడిన ఆలేటి థామస్, నవీన్, దావీద్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని, గ్రామంలో బందోబస్తును ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా ప్రసన్నకుమార్

కారంపూడి, ఆగస్టు 16: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా కే.ప్రసన్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్కూల్లో పది రోజుల క్రితం జరిగిన సంఘటనలపై అప్పటి ప్రిన్సిపాల్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికలకు శనివారం నిర్వహిస్తామని తెలిపారు.

మీటింగ్ హాల్ ప్రారంభం

ముప్పాళ్ళ, ఆగస్టు 16 : మండల కేంద్రం ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో దాతలు కంచర్ల కృపారావు, మాణిరావుల ఆధ్వర్యంలో నిర్మించిన వైద్య సిబ్బంది మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలు కృపారావు, మాణిరావులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మావతి, నాయకులు గోగినేని కోటేశ్వరరావు, శిరిగిరి గోపాలరావు, రావిపాటినానయ్య, రుద్రవరం ఎంపీటీసీ వీరభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డయేరియా వైద్యశిబిరం

● శుక్రవారమూ డోర్ టూ డోర్ సర్వే నిర్వహించిన వైద్యఆరోగ్య సిబ్బంది

క్రోసూరు, ఆగస్టు 16 : క్రోసూరు మండలం హసానాబాద్ గ్రామంలో డయేరియా వైద్యశిబిరం కొనసాగుతుంది. గత రెండు రోజుల్లో నాలుగు కేసుల వరకు కొత్తవి నమోదైనట్టు వైద్యులు తెలిపారు. బాధితుల్లో పలువురికి గృహాల వద్దనే చికిత్స చేస్తున్నామని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నామని, నమూనాలు సేకరిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్‌సాద్ తెలియజేశారు. డయేరియా లక్షణాలు ఏ మాత్రం కన్పించినా సీరియస్‌గా పరిగణిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకైతే తమ దృష్టికి 20 కేసుల వరకు వచ్చాయని, తమ వద్దకు రాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే కేసులు కూడా ఉన్నట్టు తెలిపారు. హసానాబాద్ డయేరియా బాధితులు కొంత మంది సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోను, పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లోను చికిత్స పొందుతున్నట్టు బాధితుల బంధువుల తెలియజేశారు. క్రోసూరు మండలంలోని అన్ని గ్రామాల వైద్య సిబ్బంది హసానాబాద్ మీదనే దృష్టి కేంద్రీకరించారు. డయేరియా వ్యాధికి సంబంధించి హసానాబాద్‌ను సుమారు 50 నుంచి 60 మంది ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు, సీహెచ్‌వోలు ఆషా వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ జల్లెడ పడుతున్నారు. అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్టు వైద్యాధికారి డాక్టర్ సిరి చందన తెలియ జేశారు. గ్రామంలో అనుమానితుల నుంచి నమూనా సేకరణ, ప్రజలు సేవించే మంచి నీటి నమూనాల సేకరణ మొదలైనవి వరుసగా కొనసాగిస్తున్నామని తెలియ జేశారు. అన్నిరకాల మందులను కూడా సిద్ధం చేశామన్నారు.



సత్తెనపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు, గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా, అల్పాహారం తింటున్న కన్నా తదితరులు

అన్నార్తుల కడుపునింపే అన్నక్యాంటీన్లు

● రూ. 15లకే టిఫిన్, రెండు పూటల భోజనం

● సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఆగస్టు 16 : అన్నక్యాంటీన్లు అన్నార్తుల కడుపు నింపుతున్నాయని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో శుక్రవారం కూటమి నేతలతో కలసి ఆయన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ.. ఆకలితో అలమటించే నిరు పేదలకు గుప్పెడు అన్నాన్ని అందించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందన్నారు. రూ.15కే టిఫిన్, రెండు పూటల భోజనం లభిస్తుందన్నారు. మొత్తం 2,300 అన్న క్యాంటీన్‌లకు హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా అల్పాహారం, భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామ స్వామి, మునిసిపల్ కమిషనర్ షమ్మి, జనసేన నేత బొర్రా వెంకట అప్పారావు, కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, తురకా మేరీ గ్రేస్, తోట అంబిక, దరువూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, సయ్యద్ మాబూ, రాంబో బుడే, పలువురవు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళాలు ..



అన్న క్యాంటీన్‌కు విరాళం చెక్కును అందిస్తున్న బొర్రా వెంకట అప్పారావు

పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ నిర్వాహణకు జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రూ.50,002 విరాళాన్ని శుక్రవారం మునిసిపల్ కమిషనర్ షమ్మికి అందజేశారు. భవిష్యత్‌లోనూ అన్నక్యాంటీన్‌కు తన వంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. పట్టణానికి చెందిన రిటైర్డు ఉద్యోగి రేగళ్ళ కోటి స్వామి లక్ష రూపాయల విరాళాన్ని అన్నా క్యాంటీన్ నిర్వాహణకు ఎమ్మెల్యే కన్నా సమక్షంలో మునిసిపల్ కమిషనర్ షమ్మికి అందించారు. కార్యక్రమంలో రాంబో బుడే, కట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన రిటైర్డు ఎఫ్‌సీఏ ఉద్యోగి ఆచంట జనార్దనరావు అన్నా క్యాంటీన్ నిర్వాహణ కోసం రూ 5వేలు విరాళాన్ని అందించారు.

ఐదు రూపాయలకే భోజనం బాగుంది

- చిలకా వీరయ్య దూళిపాళ్ళ



తాను తోపుడు బండి వ్యాపారం చేస్తుంటాను. ప్రతి రోజు ఉదయం ధూళిపాళ్ళ నుంచి సత్తెనపల్లి వస్తాను. ఉదయం రూ.5కే టిఫిన్, మధ్యాహ్నం రూ.5కే భోజనం అన్న క్యాంటీన్ ద్వారా ప్రభుత్వం అందించటం వల్ల తమ లాంటి పేదలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

మాచవరం, ఆగస్టు 16: ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని మండల వ్యవసాయ అధికారిణి రామమ్మ సూచించారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో ఫారెస్టు, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రామమ్మ మాట్లాడుతూ ఉద్యానవన మొక్కలు, అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి రైతులకు వివరించారు. 'ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్టు ఇన్ ఇండియా' కార్యక్రమ స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్‌వర్మ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ షేక్ ఖాశిం, వ్యవసాయ శాఖ సహాయకులు నరసయ్య, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యారాశి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశాలలు బంద్

పిడుగురాళ్ల, ఆగస్టు 16: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జికర్ వైద్యకళాశాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలకు నిరసనగా పిడుగురాళ్ల ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అన్ని ప్రైవేటు వైద్యశాలలు బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు ఐఎంఏ అధ్యక్షుడు ధూళిపాళ్ల భరత్‌కుమార్, ఉప కార్యదర్శి బీ.రాంప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు పిడుగురాళ్ల ఐఎంఏ పరిధిలోని పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల, కారంపూడి మండలాల్లోని అన్ని ప్రైవేటు వైద్యశాలల్లో సాధారణ వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నాటు సారా, గంజాయి లభిస్తే కఠిన చర్యలు

నకరికల్లు, ఆగస్టు 16: గ్రామాల్లో ఎక్కడైనా నాటు సారా కాసినా, అమ్మినా, గంజాయి కొనుగోలు చేసినా, అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం రాంబాబు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో నాటు సారా కాస్తున్నట్టు తమకు సమాచారం ఉందని, ఎవరైనా నాటు సారా కాసినా, అమ్మినా, వారికి సహకరించినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్‌లో నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్, రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్, నకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ళ మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహమంటే ఇదేరా ..

● మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

క్రోసూరు, ఆగస్టు 16 : రెండు దశాబ్దాల క్రితం తమతో కలసి చదువుకొని ఇటీవల అనారోగ్యంపాలై మరణించిన మిత్రుడి కుటుంబానికి స్నేహితులు శుక్రవారం ఆర్థిక చేయూతనిచ్చి స్నేహమంటే ఇదేరా.. అని చాటి చెప్పారు. 2003-2004 సంవత్సరంలో దాచేపల్లిలోని పాతిమా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మిత్రులందరూ కలసి బీఈడీ పూర్తి చేశారు. వీరిలో క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన దారం వెంకట శివారెడ్డి(45) జూన్ 12 మరణించాడు. విషయం తెలుసుకున్న మిత్రులు శివారెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో హసానాబాద్ హైస్కూల్‌లో తెలుగు ఉప్యాయుడుగా పనిచేస్తున్న ఎస్ హనుమానాయక్, మరో ఇద్దరు మిత్రులు సీహెచ్ మోహన్, గంగాధర్‌ల ఆధ్వర్యంలో మిత్రులందరూ కలసి రూ.11వేలు నగదును శుక్రవారం శివారెడ్డి భార్యకు అందజేశారు. అలాగే రూ. 50 వేలను శివారెడ్డి కుమార్తె పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందకుగాను వారికి శివారెడ్డి భార్య కృతజ్ఞతలు తెలియ జేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ

ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవం

రాజుపాలెం, ఆగస్టు 16 : రాజుపాలెం గ్రామంలో కొలువైయున్న పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ప్రథమ పుష్కర ద్వాదశ (12వ) వార్షిక మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమసుబ్బారావు దంపతులతో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కపాడు బ్రహ్మం బృందంచే మహిళలు కోలాటం ప్రదర్శించారు. నర్తనశాల పౌరాణిక పద్య నాటకం భక్తులను అలరించింది.



పూజలు నిర్వహిస్తున్న పొత్తూరి వెంకట రమసుబ్బారావు దంపతులు, భక్తులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16: ఇచ్చిన మాట ప్రకారం తిరిగి అన్నా క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో తిరిగి ప్రారంభించారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవినీతి ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన నారా చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో ఏఒక్కరూ ఆకలితో ఉండకూడదనే ఆశయంతో అన్న నందమూరి తారకరామారావు పేరుమీద అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందన్నారు. తరువాత 2019 అధికారంలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు రద్దుచేసి పేదవాడి పొట్ట కొట్టిందన్నారు. అంతే కాకుండా 2019 తరువాత తెలుగుదేశం పార్టీ నాయకులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లు ధ్వంసంచేసి పైశాచిక ఆనందాన్ని పొంది పేద వారి ఉసురుపోసుకున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన ఈ బృహత్తర కార్యక్రమానికి దాతలు అందరూ అండగా నిలుస్తూ స్వచ్ఛందంగా అన్న క్యాంటీన్‌ల నిర్వహణ కోసం శక్తిమేరకు ఆర్థికసాయం అందించడం అభినందనీయం అన్నారు.



పాటను ప్రదర్శించిన కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థుల బృందం

కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థుల
అమరావతి పాటకు ప్రథమ బహుమతి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16: పట్టణంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కే-రిడ్జి ఇంటర్‌నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అమరావతి పాటలకు ప్రథమ బహుమతి లభించిందని ప్రిన్సిపాల్ బర్నబాస్ శుక్రవారం తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంత్రి నాదెండ్ల మనోహర్ బహుమతులు అందజేశారన్నారు. ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులను చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇంన్‌చార్జి కోట బాపూజీ, హేమంత్, హేమ తదితరులు అభినందించారు.

19 నుంచి యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16 : నరసరావుపేట పట్టణం పట్టాభిరామస్వామి ఆలయంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 19 నుంచి 177వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్ధన్ శుక్రవారం అన్నారు. 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 5 నుంచి 7 గంటలు వరకు శిక్షణ ఉంటుందన్నారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, సెల్:9490846333, 9491665733 నంబర్లను సంప్రదించాలన్నారు.



బెస్ట్ ఇమేజ్, అప్రిసియేషన్ అవార్డుకు ఎంపికైన బ్లాక్ అండ్ వైట్, కలర్ ఫొటోగ్రఫీ చిత్రాలు

ఫొటో గ్రాఫర్లు వంగపల్లి బ్రహ్మం, కేసనపల్లి సుబ్బారావు

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

వినుకొండ టౌన్, ఆగస్టు 16: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించి ఫొటోగ్రఫీ పోటీల్లో వినుకొండకు చెందిన వంగపల్లి బ్రహ్మంకు బ్లాక్ అండ్ వైట్ విభాగంలో బెస్ట్ ఇమేజ్ అవార్డును, కలర్ సెక్షన్ విభాగంలో కేసనపల్లి సుబ్బారావుకు అప్రిసియేషన్ అవార్డులను యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గంగాధర్ ప్రకటించినట్లు బ్రహ్మం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన యూనివర్సిటీలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికైన బ్రహ్మం, సుబ్బారావులను వినుకొండకు చెందిన పలువురు ఫొటోగ్రాఫర్లు అభినందనలు తెలిపారు.



సమస్యలపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులకు వినతి పత్రం అందచేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

వినుకొండ, ఆగస్టు 16: ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు, వినుకొండకు చెందిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117, 128 జీవోలను వెంటనే రద్దు చేయాలని, మూడు, నాలుగు తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని, నెలవారీ పదోన్నతుల ద్వారా సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించి, పాఠశాలల్లో ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ మీడియాలను కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, షరీఫ్, విజయలక్ష్మి, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.




శవపేటికను అందచేస్తున్న సంగం డెయిరీ సేవాకమిటీ సభ్యులు

శవపేటిక వితరణ

మతుకుమల్లి(శావల్యాపురం) ఆగస్టు 16: మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని సంగం డెయిరీ సేవాకమిటీ ఆధ్వర్యంలో చనిపోయిన వ్యక్తుల మృతదేహాలను భద్రపరిచేందుకు గ్రామంలోని సంగం డెయిరీ సెంటర్ వద్ద శవపేటికను శుక్రవారం వితరణగా అందచేశారు. మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు మాట్లాడుతూ గ్రామస్తుల సౌకర్యార్థం సంగం డెయిరీ సేవా కమిటీ సభ్యులు తమ సొంత ఖర్చులతో శవపేటికను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు అడపాల అనిల్, విశ్రాంత ఉపాధ్యాయులు బ్రహ్మానందం, సంగం డెయిరీ అధ్యక్షుడు ముంద్రు ప్రభు, సేవా కమిటీ సభ్యులు ముంద్రు వెంకట్రావు, భరతుడు, కృష్ణారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల ఎస్ఐగా అశోక్ బాధ్యతల స్వీకారం



రొంపిచర్ల, ఆగస్టు 16: రొంపిచర్ల మండల పోలీసు స్టేషన్ ఎస్ఐగా పీ అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తుళ్ళూరు మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన రవీంద్ర నుంచి బాధ్యతలు స్వీకరించారు. రవీంద్ర వీఆర్‌కు బదిలీఅయ్యారు. విధుల్లోచేరిన అశోక్‌ను స్టేషన్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నరసరావుపేటలో అన్న క్యాంటీన్లు ప్రారంభం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16: నరసరావుపేట పట్టణంలో అన్న క్యాంటీన్లు శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డు డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం వద్ద, పల్నాడు రోడ్డు, మార్కెట్ సెంటర్‌లలో అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ పి.అరుణబాబు, ఆర్డీవో సరోజిని, మున్సిపల్ కమిషనర్ రవి చంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అన్న క్యాంటీన్లు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గడచిన ఐదేళ్ళుగా వైసీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు అన్న క్యాంటీన్లు మూసివేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కుటిలమైన ఆలోచనతో అన్న క్యాంటీన్లు మూసివేశారన్నారు. దక్షిణ భారతదేశంలో ఏపీలో అన్న క్యాంటీన్లు, చెన్నైలో అమ్మా క్యాంటీన్లు అక్కడ స్టాలిన్, ఇక్కడ నారా చంద్రబాబునాయుడు ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ఉదయం రూ5 లకే అల్పాహారం, రూ 5 లకే మధ్యాహ్నం భోజనం, అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించిన నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేశ్‌లకు ధన్యావాదాలు తెలిపారు. కలెక్టర్ పీ అరుణబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో మొత్తం పది అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మాబు, తెలుగు మహిళ అధికార ప్రతినిధి కనుమూరి లక్ష్మి, చింతిరాల బాలు, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ శిలాఫలకంను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

చిలకలూరిపేటలో మూడు క్యాంటీన్‌లు ప్రారంభం

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 16 : పేదల ఆకలి తీర్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి తమ వంతుసాయంగా దాతలు కూడా ముందుకు వస్తే మండలాల వారీగా అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలనే ఆలోచనల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆర్థికంగా స్థిరపడిన వారు అన్న క్యాంటీన్‌లకు రోజు వారి పేరుపై పుట్టిన రోజు, కుటుంబాల్లో జరిగే వివిధ కార్యక్రమాల సందర్భగా ఒక రోజు అన్న క్యాంటీన్‌కు ఎంత ఖర్చవుతుందో అంత మొత్తం ఇస్తే వారి పేరిపై ఆ రోజు ఆహారం పంపిణీ చేస్తామన్నారు. చిలకలూరిపేటలో శుక్రవారం మూడు క్యాంటీన్‌లను ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్‌తో కలసి ప్రారంభించారు. గడియార స్తంభం సెంటర్, ఎన్ఆర్‌టీ సెంటర్, అడ్డరోడ్డు సెంటర్‌లలో అన్న క్యాంటీన్‌లను ప్రారంభించిన తరువాత ప్రజలకు ఆహారం వడ్డించి, అనంతరం అధికారులు, నాయకులతో కలసి అల్పాహారం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లలో రూ.5కే అల్పాహారం అందించటం జరుగుతుందన్నారు. రోజుకు మూడు నాలుగు వందలు సంపాదించుకొనేవారు అందులో రూ.15తో మూడు పూట్ల కడుపు నింపుకొనే పథకమే ఈ అన్న క్యాంటీన్ అన్నారు. ఒక్కొక్క మనిషికి ఆహారం సరఫరా చేయటానికి రూ 90 నుంచి రూ.100 వరకు ఖర్చు అవుతుందని, రూ.75 నుంచి రూ.80 వరకు దాతల సహకారం గాని, ప్రభుత్వం గాని భరిస్తుందన్నారు. ఈ సదుపాయం పేదలకు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. గత పాలకులు కేవలం రాజకీయ కక్షతో ఎన్‌టీఆర్ ఐదు సంవత్సరాలు అన్న క్యాంటీన్‌లను మూసివేసి పేదవారి కడుపుకొట్టారని ప్రత్తిపాటి మండిపడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రావటంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు అన్న క్యాంటీన్‌లకు దాతలు సహాయం చేస్తే అది పేద వాడికి సాయం చేస్తున్నట్టు అవుతుందన్నారు.





అన్న క్యాంటీన్‌లో పేదలకు వడ్డిస్తున్న ప్రత్తిపాటి, అనంతరం ఆహారాన్ని రుచి చూస్తున్న ప్రత్తిపాటి

అన్న క్యాంటీన్‌ను ప్రారంభించడం సంతోషకరం



శ్రీనివాసరావు

రూ.5కే కడుపు నింపుతున్నారు. నేను భవన నిర్మాణ కార్మికుడిని రోజు కుంకలగుంట నుంచి నరసరావుపేటకు పని కోసం వస్తాను. రోజు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటాను. అన్న క్యాంటీన్ ప్రారంభించడంతో ఇంటి నుంచి భోజనం తెచ్చుకొనే అవసరం ఉండదు. అన్న క్యాంటీన్‌లోనే ఇక నుంచి భోజనం చేసే అవకాశం ప్రభుత్వం కల్పించింది. భోజనం చేశాను. చాలా బాగుంది. **- శ్రీనివాసరావు, కుంకలగుంట**

ఇక రోజూ కడుపు నిండుతుంది



అశోక్ కుమార్

నరసరావుపేటలోని కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. కొత్రపాడు నుంచి కళాశాలకు వస్తాను. హోటల్‌లో భోజనం చేయాలంటే రూ.100 ఖర్చు అవుతుంది. దీంతో మధ్యాహ్నం భోజనం చేయకుండానే ఒక్కోరోజు పస్తు ఉండేవాడిని. అన్న క్యాంటీన్ ప్రారంభించారు. రోజు మధ్యాహ్నం పస్తు ఉండాల్సిన అవసరం లేదు. క్యాంటీన్‌లో భోజనం చేస్తాను. రుచికరమైన భోజనం అందిస్తున్నారు. చంద్రబాబు నాయుడుని గెలిపించుకున్నాం. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకొని తమ కడుపు నింపుతున్నారు.

- అశోక్‌కుమార్, డిగ్రీ విద్యార్థి, కొత్రపాడు

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. పగిలిన పైపులైన్

నరసరావుపేట, ఆగస్టు 16 : విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో తాగునీటి పైపులైను పగిలిపోయిన సంఘటన నరసరావుపేట పట్టణంలో జరిగింది. పల్నాడు రోడ్డులో ప్రైవేట్ కాంప్లెక్స్‌కు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసే పనులు విద్యుత్ శాఖ శుక్రవారం చేపట్టింది. తాగునీటి పైపులైన్‌పై విద్యుత్ స్తంభం కోసం డ్రిల్లింగ్ వేయడంతో పైపులైన్ పగిలిపోయింది. భారీగా తాగు నీరు రోడ్డుపై ప్రవహించింది. తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మునిసిపాల్టీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా పనులు నిర్వహించడం పట్టణంలో పరిపాటిగా మారింది. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ప్రైవేట్ కేబుల్ నిర్మాణం కోసం డ్రిల్లింగ్ వేయండంతో పైపు లైన్ పగిలింది. ఇటువంటి పనులు నిర్వహించే సమయంలో మునిసిపాల్టీ అనుమతి తప్పనిసరి. మునిసిపల్ సిబ్బంది పర్యవేక్షణలోనే నిర్వహించాల్సి ఉంది. ప్రధాన రహదారికి రెండు వైపుల పట్టణానికి తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్లు ఉన్నాయి. వీటిపైనే అక్రమ కట్టడాలు వస్తున్నాయి. వీటిని నిరోధించడంలో మునిసిపాల్టీ విఫలమవుతుంది. దీనివలన తరచూ పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథా అవుతోంది. మునిసిపాల్టీ పైపులైన్‌పై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి, పైపులైన్‌కు సంబంధించిన సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవు. పైపులైన్ పగిలిపోవడానికి కారకులైన విద్యుత్ శాఖ కాంట్రాక్టర్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామని డీఈ శ్రీనివాసరావు తెలిపారు.



పైపు లైను పగిలి రోడ్డుపై ప్రవహిస్తున్న తాగు నీరు

నేడు నీటి సరఫరా నిలిపివేత

పగిలిన పైపు లైన్‌కు మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలకు శనివారం ఉదయం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు కమిషనర్ రవి చంద్రారెడ్డి తెలిపారు. 1వవార్డు, 10 నుంచి 20 వరకు వార్డులు, 34 వ వార్డు, బ్యాంక్ కాలనీ, విద్యానగర్, గ్యాస్ గోదాము ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు. శనివారం సాయంత్రం నీటి సరఫరా చేస్తామన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతాలు

శావల్యాపురం, ఆగస్టు 25: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శావల్యాపురం, పోట్లూరు, గంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాలలోని దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ప్రొద్దున్నే దేవాలయాలకు వెళ్ళి అమ్మవార్లకు క్షీరాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవార్లకు చీరసారెలను కానుకగా సమర్పించారు. పోట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయంలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. శావల్యాపురం సెంటర్లోని కనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారికి కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ పూజారులు శ్రీనివాసరావు, రావిపాటి సాయిభరత్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ధర్మకర్తలు గోనుగుంట్ల వెంకట్రావు, రెడ్డి జ్వాలా నరసింహారావులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం దేవాలయాల్లో భజనలు చేశారు.





గంటవారిపాలెంలో శాకాంబరిగా లక్ష్మీతిరుపతమ్మ, శావల్యాపురంలో కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

● వినుకొండ టౌన్, ఆగస్టు 16: స్థానిక సిద్దార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్లో విద్యార్థులు శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ శ్రావణమాసం శుక్లపక్షం పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా జరుపుకోవడం హిందూల సంప్రదాయమని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతం ను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వరలక్ష్మీదేవికి పూజలు చేశారు. ముప్పాళ్ళ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, కొచ్చెర్ల అంకాళ పరమేశ్వరి దేవాలయాలలో మహిలలు ప్రత్యేక పూజలు జరిపించారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల, ఆగస్టు 16: మండలంలోని గ్రామాల్లో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రొంపిచర్లలోని వాసవి, చౌడేశ్వరి, శంకర స్వామి, వడ్లమూడివారిపాలెం లోని నీలకంఠేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, గోగులపాడు, సంతగుడిపాడు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. వాసవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం పూజలు జరిగాయి. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు, కొప్పు కోటయ్య, గొడవర్తి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● నాదెండ్ల, ఆగస్టు 16 : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారాన్ని మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. సాతులూరిలోని సీతారాములవారి దేవస్థానంలో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అదేవిధంగా గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామ స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.





గీతమ్స్ హైస్కూల్లో వరలక్ష్మీవ్రత పూజల్లో పాల్గొన్న చిన్నారులు, గణపవరంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

20 నుంచి ఆధార్ నమోదు కేంద్రాల శిబిరాలు

చిలకలూరిపేట, ఆగస్టు 16: మండలంలో ఈ నెల నుంచి 20 నుంచి 24వ తేదీ వరకు ఆరు గ్రామాల్లోని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కోసం శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చిలకలూరిపేట ఎంపీడీవో కే శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మానుకొండవారిపాలెం, ఎడవల్లి, గోవిందపురం గ్రామ సచివాలయాల్లో ఈ శిబిరాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో దండమూడి, కట్టుబడివారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కావూరు గ్రామ సచివాలయంలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ప్రజలు శిబిరాలకు వచ్చి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ఆయన కోరారు.

స్వచ్ఛతలో చిలకలూరిపేటను ముందు నిలపాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చెత్త సేకరణ వాహనాలు, బుట్టలు పంపిణీ చేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 16: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న స్వచ్ఛ సంకల్పంలో తమ నియోజకవర్గం చిలకలూరిపేట పట్టణాన్ని ముందు వరుసలో నిలపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అధికారులను ఆదేశించారు. చేశారు. చిలకలూరిపేట పట్టణంలో తాగునీటికి లోటు రానివ్వవద్దన్నారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చిలకలూరిపేట మునిసిపాలిటీలో ఇంటింటికి చెత్త సేకరణ కోసం చెత్త బుట్టలు, వాహనాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం పండరీపురం 9వ లైన్‌లో పారిశుధ్య సిబ్బందికి 25 తోపుడు బండ్లు, తడి పొడి చెత్తను వేర్వేరు సేకరించేందుకు 450 చెత్త బుట్టను పంపిణీ చేశారు. పట్టణంలో కుక్కలతో ఇబ్బందులు పడుతున్నారని, వెటర్నరీ శాఖతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించామని, త్వరలో చిలకలూరిపేటలో కుక్కల బెడద లేకుండా చేస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.



యడ్లపాడులో జరిగిన ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

అక్రమ చెల్లింపులను రికవరీ చేయండి

● పీడీ జోసెఫ్ కుమార్

యడ్లపాడు, ఆగస్టు 16: ఉపాధి సొమ్మును అక్రమంగా పొందిన వారి నుంచి రికవరీ చేయాలని డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ అన్నారు. యడ్లపాడులో శుక్రవారం నిర్వహించిన ప్రజా వేదికలో పలు విషయాలను అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సామాజిక తనిఖీ బృందం గుర్తించిన విషయాలు సభలో వివరించారు. లింగారావుపాలెంలో అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న బీ సుధారాణి 14నెలలుగా సామాజిక పింఛన్ తీసుకున్న విషయాన్ని గుర్తించారు. ఉద్యాన తోటలు వేసిన రైతులకు బిల్లులు చెల్లించి అనంతరం తోటలను కొట్టివేసిన విషయాన్ని తనిఖీల్లో గుర్తించామని వివరించారు. ఇలా ఉపాధి హామీ పథకం సొమ్ము దుర్వినియోగం అయిందని సభలో వివరించారు. వారి నుంచి నగదును రికవరీ చేయటంతో పాటు చర్యలు తీసుకోవాలని జోసెఫ్ కుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సుధాకర్, ఏవీవో విజయకుమార్, ఏపీవో భరత్ కుమార్, ఎంపీడీవో హనుమారెడ్డి, ఎస్ఆర్‌పీ ఏఎస్ రాజు, ఏపీవోలు వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

యడ్లపాడు, ఆగస్టు 16: మండలంలోని మైదవోలు గ్రామానికి చెందిన నక్కా చెంచు కుటుంబ సభ్యులకు రూ.50వేలు సాయం చెక్కును సంగం డెయిరీ డైరెక్టర్ కట్టా జగన్‌మోహనరావు అందజేశారు. యడ్లపాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో చెంచు సభ్యుడిగా ఉన్నారు. అతను కొద్ది రోజుల క్రితం మరణించటంతో పీడబ్ల్యూఎస్ పథకం కింద ఈ చెక్కును అందజేశారు. అంతేగాకుండా రూ.10వేలను మట్టి ఖర్చులకు సంగం అధ్యక్షుడు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట మేనేజర్ వీరేంద్రబాబు, డైరెక్టర్ సాగి నారయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి



నూతక్కి నాగరాజు

నాదెండ్ల, ఆగస్టు 16: మండలంలోని సంక్రాంతిపాడు వీఆర్వోగా పనిచేస్తున్న నూతక్కి నాగరాజు(44) శుక్రవారం ఉదయం మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నాగరాజు స్వగ్రామం తూబాడు. గతంలో కనపర్రు, చందవరం గ్రామాల్లో కూడా వీఆర్‌వోగా పనిచేశాడు. కాగా ఆయన భౌతిక కాయాన్ని తహసీల్దార్ ఏవీ రమణ, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఆర్ఐ రమీజ, పలు గ్రామాల వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది, సందర్శించి నివాళులర్పించారు.

ఉత్తమ ఏఈవోగా అశోకకు ప్రత్యేక గుర్తింపు

శావల్యాపురం, ఆగస్టు 16: మండలం నుంచి వ్యవసాయ విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్న పూరేటి అశోక ఉత్తమ సేవాపురస్కారానికి ఎంపికయ్యారు. నరసరావుపేటలోని కోడెల శివప్రసాద్ క్రీడాప్రాంగణంలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పూరేటి అశోక ఉత్తమ వ్యవసాయ విస్తరణాధికారిగా పురస్కారం, ప్రశంసా పత్రంను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అందుకున్నారు.

ఎంఏఎం ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 16: స్థానిక కేసానుపల్లిలోని మేదరమెట్ల అంజమ్మ, మస్తానరావు ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు శుక్రవారం తెలిపారు. నాక్ బృందం కళాశాలలో పర్యటించి కళాశాల విద్యా ప్రక్రియలు, ఫలితాలు, పాఠ్యప్రణాళిక కవరేజీ, బోధన-అభ్యాస ప్రక్రియలు, అధ్యాపకులు, పరిశోధన, మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు, సంస్థ, పాలన, ఆర్థిక శ్రేయస్సు, వాటి పనితీరు ఆధారంగా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నాక్ ఏగ్రేడ్‌ని ప్రకటించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. గుర్తింపు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి దోహదపడుతుందని డైరెక్టర్ దరువూరి శ్రావ్య అన్నారు.

అన్నవరం సొసైటీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

రొంపిచర్ల, ఆగస్టు 16: మండలంలోని అన్నవరం సొసైటీలో గుమస్తాగా పని చేస్తున్న ఓరుగంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్వగ్రామమైన నల్లగార్లపాడులో ఈ సంఘటన చోటు చేసుకుంది. శ్రీనివాసరెడ్డి అన్నవరం సొసైటీలో గుమస్తాగా పని చేస్తున్నాడు. తనను తన పై అధికారులు ఉద్యోగం మానివేయాలంటూ వేధింపులకు గురిచేస్తుంటే ఆత్మహత్యకు యత్నించినట్టు రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదుచేశారు. నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స పొందుతున్న శ్రీనివాసరెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు.

మా సొసైటీలో పని చేయటం లేదు: స్పెషల్ అధికారి సురేంద్ర

ఓరుగంటి శ్రీనివాసరెడ్డికి తమ సొసైటీతో ఏ మాత్రం సంబంధం లేదని ప్రత్యేక అధికారి సురేంద్ర శుక్రవారం తెలిపారు. అతన్ని సొసైటీకి రావద్దని అనేకసార్లు చెప్పామన్నారు. కుటుంబంలో విభేదాలు నెలకొనటం వలనే ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిపారు. కావాలనే అన్నవరం సొసైటీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఐనవోలులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

నూజెండ్ల, ఆగస్టు 16: మండలంలోని ఐనవోలులో శుక్రవారం చింతలచెరువు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతను తెలియ జేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఐనవోలు పీహెచ్‌సీ డాక్టర్ వెస్‌కే వహిదా రజాక్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ ఎం నాగరాజ కుమారి, బీ శర్మిషా, వీ రామకృష్ణ, సురేష్, భార్గవి, జీ లక్ష్మీప్రియ, ఎం పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.